సాక్షి అనంతపురం

సోమవారం । 8 । జనవరి । 2024



టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



'సాక్షి' స్పెల్‌బీకి విశేష స్పందన

కర్నూలులో ఆదివారం జరిగిన సాక్షి స్పెల్‌బీ రీజనల్‌స్థాయి పోటీలకు అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు.

8లో

గరిష్టం/కనిష్టం

34.2°/ 19.7°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత కొనసాగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- గృహ నిర్మాణ సంస్థ పీడీ నరసింహారెడ్డి

అనంతపురం టౌన్: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం గృహ నిర్మాణ సంస్థ అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 76వేల ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే మొదటి విడతలో 22వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవడంతో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించి లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. ఈ నెలాఖరులోపు 25 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హౌసింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా చూడాలన్నారు. బిల్లులు సైతం సకాలంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. దీంతో పాటు ఆప్షన్-3 కింద చేపడుతున్న ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతి ఉండాలన్నారు. కాంట్రాక్టర్లతో చర్చించి సమన్వయంతో పనులు వేగవంతం చేయాలన్నారు. రోజు వారీగా పనుల పురోగతులపై నివేదికలను అందజేయాలన్నారు. ఆలమూరు, కొడిమి, ఉప్పరపల్లి జగనన్న కాలనీలపై దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే ఆయా కాలనీలలో మౌలిక వసతులు వంద శాతం కల్పించామన్నారు. వారంలో మూడు రోజులు అధికార యంత్రాంగం జగనన్న కాలనీల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించాలన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీ రంగయ్య, ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో ఎంపీ నిధులతో నూతన కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్మాణానికి ఎంపీ తలారి రంగయ్య, ఎస్పీ అన్బురాజన్ ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎస్పీలను పోలీసు అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, అంబటి హనుమంతు, ఏఆర్ డీఎస్పీలు ప్రసాద్‌రెడ్డి, శివారెడ్డి, మునిరాజా, సీఐలు రెడ్డప్ప, శివరాముడు, ఆర్ఐ రాముడు, ఆర్ఎస్ఐ రమేష్ నాయక్, ప్రవీణ్ కుమార్, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, కాంట్రాక్టర్ సుబ్రమణ్యం, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, హరి పాల్గొన్నారు.

11న జిల్లా జైలులో వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: మండలంలోని అనంతపురం జిల్లా జైలులో ఈ నెల 11న వేరుశనగ చెక్కకు వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా జైలు సూపరింటెండెంట్ రహమాన్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రాంతీయ జైళ్ల శాఖ ఉపశాఖాధికారి కడప రేంజ్ సమక్షంలో ఉదయం 11 గంటలకు 25వేల కిలోల వేరుశనగ చెక్కకు వేలం పాట ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు రూ.22 వేలు ధరావత్తు చెల్లించాలి. వేలం ముగిసిన తర్వాత ధరావత్తు సొమ్ము వెనక్కు చెల్లిస్తారు.

సీఐలకు స్థాన చలనం



అనంతపురం క్రైం: అనంతపురం రేంజ్ పరిధిలో 23 మంది సీఐలకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు డీసీఆర్‌బీ నుంచి ఎం.సుబ్రహ్మణ్యం, వీఆర్‌లో ఉన్న ఎం.ఆశీర్వాదంను అనంతపురం ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేశారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న డి.చల్లా అనంతపురం రేంజ్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. బీఎస్ కండ్రిగ సర్కిల్ నుంచి ఎస్.విక్రమ్‌ను వీఆర్ కింద అనంతపురం ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేశారు. పుత్తూరు అప్‌గ్రేడ్ పీఎస్ నుంచి కె.లక్ష్మీనారాయణను, తిరుపతి ట్రాఫిక్ పీఎస్ నుంచి వి.శివ ప్రసాద్, తిరుపతి ఎస్పీ కార్యాలయం వీఆర్‌లో ఉన్న బీవీ శ్రీనివాసులును అనంతపురం ఎస్పీ కార్యాలయం వీఆర్‌కు పంపారు.



ఉరవకొండలో ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఒక భాగం



జయజయధ్వానాల మధ్య సాగుతున్న సామాజిక సాధికార బస్సుయాత్ర

ఉరవకొండలో సామాజిక సౌరభం

- బస్సు యాత్ర సూపర్ సక్సెస్
- తరలివచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు
- ప్రతిధ్వనించిన బడుగుల 'సాధికార' నినాదం
- జగన్ పాలనలోనే సంక్షేమం



సామాజిక సాధికార సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి. చిత్రంలో ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, హఫీజ్‌ఖాన్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పార్టీ పరిశీలకుడు శ్రీనివాసులు తదితరులు

ఉరవకొండ : రాజకీయ, నామినేటెడ్ పదవులతో పాటు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన బడుగులు 'సామాజిక సాధికార యాత్ర'కు బ్రహ్మరథం పట్టారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఆదివారం ఉరవకొండలో అడుగు పెట్టగానే ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సారథ్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి యాత్ర ప్రారంభమైంది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ముందుకు సాగారు. క్లాక్‌టవర్ సమీపంలోని పాత బస్టాండ్ సర్కిల్‌కు యాత్ర చేరుకుంది. ముఖ్య అతిథులుగా ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, పెనుకొండ ఎమ్మెల్యే, అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణ, అనంతపురం మేయర్ వసీం, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌యాదవ్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, చేనేత నాయకురాలు చందా చంద్రమ్మ, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు హాజరయ్యారు. ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ముఖ్య అతిథులకు క్రేన్ సహాయంతో గజమాలను వేశారు. బస్సు యాత్రకు మద్దతుగా యువజన విభాగం నేత వై.ప్రణయ్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథులు ప్రసంగించారు. జగనన్న పాలనలో జరిగిన మేలును, కలిగిన లబ్ధిని వివరించేటపుడు బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు ఈలలు, కేకలు, కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. తమకు సమాజంలో సముచిత స్థానం, అవకాశాలు కల్పించిన సీఎం జగన్‌కు అండగా ఉంటామని, మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొస్తామని నినదించారు.



మహిళా కార్యకర్త ఆనంద హేల



నేతల ప్రసంగాలను ఆసక్తిగా వింటున్న జనం



సాధికార యాత్రలో మహిళల నృత్యం



జగన్ నాయకత్వానికి జై కొడుతున్న మహిళలు



ఫ్యాన్ గుర్తుతో యువత సందడి

జగన్ విజయయాత్రను ఆపలేరు



త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. చంద్రబాబు, పవన్ లాంటి పెత్తందార్లు ఏకమై పేదల పక్షాన నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడానికి కుట్రలు పన్నుతున్నారు. జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేక కుటుంబాల్లో చిచ్చులు పెడుతున్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా జగన్ విజయయాత్రను ఆపలేరు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలు తలెత్తుకునేలా సముచిత స్థానం కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఉపముఖ్యమంత్రి పదవులు ఇచ్చారన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.1300 కోట్లు ఖర్చు చేశారు. 3వేల మందికి ఇంటి స్థలాలు, 10 వేల పక్కా గృహాలు మంజూరు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు రూ.128 కోట్ల పంటల బీమా, రూ.30 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ, రూ.175 కోట్ల రైతు భరోసా అందించారు. ఉరవకొండ పట్టణంలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మేలు చేసిన జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

– వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త

నయవంచకుడు చంద్రబాబు



డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మహిళలను నమ్మించి నట్టేట ముంచిన నయవంచకుడు చంద్రబాబు. మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ హామీని అమలు చేయకుండా విస్మరించిన వ్యక్తి.. ఇప్పుడు మళ్లీ మాయమాటలతో జనం ముందుకు వస్తున్నారు. అలాంటి వ్యక్తిని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరు. బీసీలను మోసగించేందుకు మాయమాటలు చెబుతున్నారు. మోసకారి చంద్రబాబును చిత్తుగా ఓడించి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలి.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

నాన్న.. జనం మనిషి



మా నాన్న విశ్వేశ్వరరెడ్డి ప్రజా సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన గెలిచినా, ఓడినా జనం మధ్యే ఉంటున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా అహర్నిశలూ శ్రమిస్తున్నారు. పయ్యావుల కేశవ్ బోగస్ పట్టాలు ఇచ్చి ప్రజల చేత ఓట్లు వేయించుకుని ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రజల సమస్యలు పట్టని, నమ్మిన వారిని నట్టేట ముంచే కేశవ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు.

– వై.ప్రణయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్

70 శాతం పదవులు బడుగులకే



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకే 70 శాతం పదవులు దక్కాయి. రాష్ట్రంలో బీసీల ఆత్మగౌరవం పెరిగింది. జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుని బీసీ వర్గాలు మరింత అభ్యున్నతి చెందాలి.

– మాలగుండ్ల శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త

జగనన్న ప్రభంజనం



వైఎస్సార్‌సీపీ పాలనలోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమైంది. నాకు కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా పనిచేసే అవకాశం కల్పించడం గొప్ప విషయం. రాష్ట్రంలో జగనన్న ప్రభంజనం కనిపిస్తోంది. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరు.

– తలారి రంగయ్య, అనంతపురం ఎంపీ

అన్నిచోట్లా వైఎస్సార్‌సీపీదే గెలుపు



ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంటు స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులదే గెలుపు. బోగస్ హామీలతో వచ్చే తెలుగుదేశం పార్టీ ఈసారి ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోవడం ఖాయం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జగనన్న పాలనలోనే మేలు జరిగింది.

– పైలా నర్సింహయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

భక్తిశ్రద్ధలతో కనకదాస విగ్రహ ప్రతిష్ట



కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (చిత్రంలో) జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు

- కనకదాస అన్ని వర్గాలకూ ఆదర్శప్రాయుడు
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: కురుబల ఆరాధ్య దైవం.. కనకదాస విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఆత్మకూరులో భక్తిశ్రద్ధలతో సాగింది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించి, విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్త కనకదాస కురుబలకే కాకుండా అన్ని వర్గాల ప్రజలకూ ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీపీ సుబ్బర హేమలత, మాజీ మేయర్ రాగే పరుశురామ్, కురుబ సంఘ యువ నాయకులు బిల్లే మంజునాథ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న, లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పార్వతమ్మ, జిల్లా కార్యదర్శి వెంకట్రాముడు, ధాబా మల్లన్న, నసనకోట దేవాలయ కమిటీ చైర్మన్ ముత్యాలు, కాయగూరల ముత్యాలన్న, సిమెంట్ పోలన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బంధూక మధు, నాటక అకాడమీ మాజీ చైర్‌పర్సన్ రాగే హరిత, మాజీ ఎంపీపీ పిల్లల ఈశ్వరయ్య, నాయకులు మారెన్న, బిల్లే శివయ్య, రాజశేఖర్, సుబ్బర బాలకృష్ణ, చిత్రా వెంకటేష్, చిత్రా గురు, ఎబ్బిలి పోలన్న, అంజినప్ప, రామకృష్ణ, ఆది, పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి, మాజీ సర్పంచ్ వన్నూరప్ప, గోసుల కొండా, పెట్రోలు హనుమంతు, సుబ్బర అనిల్, దుద్దేకుంట రామాంజినేయులు, ఈశ్వరయ్య, బిల్లే నాగేంద్ర, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు అదనపు 'ఉపాధి'

- కరువు మండలాల్లో 50 అదనపు పనిదినాలు
- ప్రతి వారం పంచాయతీరాజ్ సెక్రటరీల సమీక్ష
- పనికి ముందు రోజు గ్రామంలో దండోరా
- జిల్లా యంత్రాంగానికి సర్కారు ఆదేశాలు జారీ



సాక్షి ప్రతినిధి, అనంతపురం: కరువు పరిస్థితుల నేపథ్యంలో కూలీలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాల్లో పనిదినాలు పెంచాలని సర్కారు నిర్ణయించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగిన కూలీకి ఏడాదిలో వంద రోజులు పని చూపుతారు. ఈ ఏడాది సగటు కన్నా తక్కువ వర్షపాతం నమోదైన కారణంగా వ్యవసాయ కూలీలు, ఇతర కూలీలు ఇబ్బంది పడకుండా అదనంగా 50 పనిదినాలు పెంచాలని సర్కారు భావించింది. ఈ మేరకు జిల్లా రెవెన్యూ, పంచాయతీరాజ్ విభాగాలకు ఆదేశాలు జారీ చేసింది. ఏ డాదిలో 100 పనిదినాలను 150 రోజులకు పెంచింది.

అత్యధికంగా అనంతపురం జిల్లాలోనే..

రాయలసీమలో ఎక్కువ కరువు మండలాలను అనంతపురం జిల్లాలోనే ప్రకటించారు. అనంతపురం జిల్లాలో 28, శ్రీసత్యసాయి జిల్లాలో 21 మండలాలు కరువు జాబితాలో ఉన్నారు. అంతే కాదు ఉపాధి హామీ పని కోసం ఎక్కువ కుటుంబాలు నమోదైంది కూడా అనంతపురం జిల్లాలోనే. 2.73 లక్షల కుటుంబాలు ఇప్పటికే నమోదు చేసుకున్నాయి. ఇప్పటివరకూ సుమారు 63 శాతం పనిదినాలు దక్కాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 91వేల పనిదినాలు కల్పించారు.

వలసలు నియంత్రించేందుకే..

రాయలసీమలో ఏ ఈడాది చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 102 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. ఈ ఆరు జిల్లాల్లో కలిపి ఇప్పటి వరకు 10 లక్షల కుటుంబాలు ఉపాధి కోసం నమోదు చేసుకోగా అందులో 6 లక్షలకు పైగా కుటుంబాలకు ఉపాధి లభించింది. మిగతా కుటుంబాలకు కూడా పనిదినాలు కల్పించాలని తాజాగా నిర్ణయించారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఈ పనిదినాలు కల్పిస్తారు.

రాయలసీమలో ఉపాధి పనుల కోసం నమోదు ఇలా..

జిల్లా	కరువు మండలాలు	ఉపాధి కోసం నమోదు చేసుకున్న కుటుంబాలు
చిత్తూరు	4	32397
అన్నమయ్య	18	143219
అనంతపురం	28	273425
సత్యసాయి	21	182343
కర్నూలు	23	288703
నంద్యాల	6	56863

గ్రామాల్లో దండోరా వేయాలి..

కరువు మండలాల్లో ఉపాధి హామీ పనులపై విస్తృత ప్రచారం కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. పీఓలు, ఎంపీడీఓలు ఉపాధి పనికి ముందురోజు గ్రామాల్లో దండోరా వేయాలని, ఇలా ప్రతి వారమూ ముందురోజు ఆయా గ్రామాల్లో దండోరా వేసి చెప్పాల్సి ఉంది. ప్రతి వారమూ ఉపాధి హామీపై పంచాయతీ సెక్రటరీలు సమీక్ష నిర్వహించి ఆయా కుటుంబాలకు లేదా సభ్యులకు ఉపాధి లభించిందా లేదా, డబ్బు చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా వంటివి చూడాలి.

పక్కాగా అమలు చేస్తాం

కరువు మండలాల పరిధిలో ఉన్న గ్రామాల్లో 50 అదనపు పని దినాలు కల్పించేందుకు పక్కాగా కార్యాచరణ రూపొందించాం. ఇప్పటికే ఆయా మండలాల అధికారులకు ఆదేశాలు జారీచేశాం. వంద రోజులు పనిదినాలు కాకుండా అదనంగా మరో 50 రోజులు పని కల్పించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. – గౌతమి, కలెక్టర్, అనంతపురం

క్లుప్తంగా

జిల్లాకు 2,634 మెట్రిక్ టన్నుల యూరియా



ఎరువులు పరిశీలిస్తున్న ఏడీఏ ఎం.రవి

అనంతపురం అగ్రికల్చర్: రబీ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు ఇఫ్కో కంపెనీ నుంచి జిల్లాకు 2,634 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయింది. ఆదివారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరుకున్న యూరియా బస్తాలను రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కలెక్టర్ జేసీ, డీఏఓ ఆదేశాల మేరకు 1,317 మెట్రిక్ టన్నుల చొప్పున రెండు జిల్లాలకు కేటాయించామన్నారు. ఇండెంట్ మేరకు ఆర్బీకేలు, సొసైటీలు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు. మిగులు ఎరువులను మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో నిల్వ చేస్తామన్నారు.

కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు సమీపంలో ఉన్న హంద్రీ–నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల ప్రాజెక్ట్ వద్ద ప్రధాన కాలువలో ఆదివారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ వెంకటరమణ, సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. తట్రకల్లు వీఆర్వో మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి 30 సంవత్సరాల వయస్సు ఉంటుందని అంచనా వేశారు. శరీరంపై లోయర్, టీషర్టు మాత్రమే ఉన్నాయి. మెడలో రుద్రాక్షలు ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు వజ్రకరూరు పోలీసులను సంప్రదించాలని ఏఎస్‌ఐ వెంకటనారాయణ కోరారు.

రెడ్డి సంఘం నేత అరెస్ట్ అవాస్తవం

అనంతపురం క్రైం: రెడ్డి సంఘం నేత నరేష్‌కుమార్ అరెస్ట్ అవాస్తవమని, ఎలాంటి కేసూ నమోదు చేయలేదని పోలీసు శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. నిబంధనల మేరకు అనుమతి తీసుకుని విగ్రహావిష్కరణ చేసుకోవాలంటూ లిఖిత పూర్వక సూచనలు చేసినట్లు వివరించింది. అవాస్తవాలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది.

అనంత సాహిత్యానికి అరుదైన గౌరవం

- రేపు 'అనంత' వేదికగా తెలుగు భాషా వైభవ సదస్సు
- తరలి రానున్న సాహితీ దిగ్గజాలు

అనంతపురం / కల్చరల్: 'అనంత' సాహిత్యానికి, సంప్రదాయ కవిత్వానికి, ఆధునిక కృషికి మరోసారి సమున్నత గౌరవం దక్కేలా జిల్లా కేంద్రంలో గొప్ప భాషా సదస్సు జరగనుంది. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జేఎన్‌టీయూ ఆడిటోరియం వేదికగా సాగే 'అనంత' తెలుగు భాషా వైభవ సదస్సుకు పలు ప్రాంతాల నుంచి సాహితీ దిగ్గజాలు, భాషావేత్తలు, ప్రజాప్రతినిధులు తరలి రానున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అనంత సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్న భాషాభిమానులను, రచయితలను, కవులను ఘనంగా సత్కరించనున్నారు. ముఖ్యంగా సాహితీ దిగ్గజాలను ప్రత్యేకంగా గుర్తించి జీవిత సాఫల్య పురస్కారాలు అందిస్తున్నారు. గత ప్రభుత్వాలు తూతూమంత్రంగా నడిపిన అధికార భాషా సంఘాన్ని విస్తృత ప్రయోజనాలు కల్గించేలా తీర్చిదిద్దుతున్న ప్రస్తుత ప్రభుత్వ కృషిని ఇప్పటికే సాహితీవేత్తలు అభినందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలుగు భాష అవసరాన్ని, ఔన్నత్యాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో పలు జిల్లాలలో భాషా సదస్సులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే అనంతలో ఈ నెల 9న ఉదయం నుంచి సాయంత్రం వరకు సాహిత్య, సాంస్కృతిక, కళా ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించేందుకు సంసిద్ధమవుతున్నారు.



శ్రీకృష్ణదేవరాయల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న సినీనటుడు కౌశిక్ బాబు

పురస్కార గ్రహీతలు వీరే..

ఉమ్మడి జిల్లాలో విశేష కృషి చేస్తున్న సాహితీ మూర్తులను ప్రభుత్వం తెలుగు భాషా సేవా జీవిత సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేసింది. డాక్టర్ అమళ్లదిన్నె వెంకటరమణ ప్రసాద్, జయలక్ష్మిరాజ్, చొప్పా వీరభద్రప్ప, ఆచార్య మూడే గోనా నాయక్, షేక్ నబీరసూల్, డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, డాక్టర్ కల్లూరి ఆనందరావు, డాక్టర్ కేతు బుచ్చిరెడ్డి, శింతి జయప్రకాష్, జెట్టీ జైరామ్ పురస్కారాలు అందుకోనున్నారు. అలాగే మరో నలభై మంది రచయితలు, కవులకు భాషా సేవా పురస్కారాలను అందించనున్నారు. అనంత కళారూపాలకు ప్రాణం పోస్తున్న మరో నలభై మంది కళాకారులను ఘనంగా సత్కరించనున్నారు.

కార్యక్రమాల వివరాలు

- ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పోలా విజయబాబు నేతృత్వంలో జేఎన్‌టీయూ ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రారంభోత్సవ సభ జరుగుతుంది. ముఖ్య అతిథుల ప్రసంగాలు ఉంటాయి. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే సదస్సులో జిల్లా సాహిత్య వైశిష్ట్యం, జిల్లా భాషా వైశిష్ట్యం, జిల్లా పద్యం, జిల్లా ఆధునిక కవిత్వం, అనంతపురం జిల్లా నవలపై ప్రసంగాలతో పాటూ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.
- మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జిల్లా కథానిక, జిల్లా జానపదం, అనంత జిల్లా నాటకం– బళ్లారి రాఘవ, జిల్లా సాహిత్య విమర్శ, అనంతపురం జిల్లా సాహిత్యంలో హాస్యం వంటి అంశాలపై ప్రత్యేక ప్రసంగాలు, సాంస్కృతిక సంబరాలు ఉంటాయి.
- సాయంత్రం 'జయహో శ్రీకృష్ణదేవరాయ' నృత్య రూపకాన్ని సినీనటుడు 'ఆదిశంకర ఫేమ్' కౌశిక్‌బాబు బృందం ప్రదర్శించనుంది.
- సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ముగింపు సభ, ప్రసంగాలు, పురస్కార ప్రదానాలు ఉంటాయి.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



బ్యాటింగ్‌కు వేచి చూస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ (చిత్రంలో) మేయర్ వసీం

అనంతపురం: క్రీడలతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని, ఉద్యోగుల జీవితంలో క్రీడలు ఓ భాగమైనప్పుడే విధుల నిర్వహణ సజావుగా సాగుతుందని అనంతపురం నగర మేయర్ వసీం అన్నారు. అనంత క్రీడాగ్రామంలోని ప్రధాన క్రికెట్ స్టేడియం వేదికగా మున్సిపల్, రెవెన్యూ ఉద్యోగుల క్రికెట్ పోటీలను జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ ఆర్డీ పీవీఎస్ మూర్తితో కలసి ఆదివారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. మానసిక, శారీరక వికాసానికి వయో భేదం లేకుండా ప్రతి ఒక్కరూ తరచూ క్రీడల్లో పాల్గొంటుండాలన్నారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే మున్సిపల్ ఉద్యోగులకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం గర్వకారణమన్నారు.

రెవెన్యూ జట్టు విజయం..

ఉద్యోగుల క్రికెట్ పోటీల్లో తొలుత బ్యాటింగ్ చేసిన రెవెన్యూ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసింది. జట్టులో సంజీవరెడ్డి 57 పరుగులు, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ 22 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన మున్సిపల్ జట్టు 15.5 ఓవర్ల వద్ద 86 పరుగులకే కుప్పకూలింది. యుగంధర్‌రెడ్డి 41 పరుగులు చేశారు.

జగన్‌తోనే సామాజిక సాధికారత

- అన్ని వర్గాలకూ సముచిత స్థానం
- మేధావుల సదస్సులో మాజీ ఎమ్మెల్యే విశ్వ



మాట్లాడుతున్న వై.విశ్వేశ్వరరెడ్డి (చిత్రంలో) అబ్జర్వర్ శ్రీనివాసులు, ఎంపీ రంగయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు

విడపనకల్లు: సామాజిక సాధికారత సీఎం జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమైందని, ఆయన పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం దక్కిందని ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ అబ్జర్వర్ శ్రీనివాసులు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉరవకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మేధావుల సదస్సు జరిగింది. విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు పార్టీ ముఖ్య నాయకులు, వివిధ రంగాలకు చెందిన మేధావులు హాజరయ్యారు. విశ్వ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీ పాలనలోనే సాధ్యమైందన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి గ్రామ స్వరాజ్యాన్ని సిద్ధింప చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా బీసీలకు రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత కల్పించి అన్ని పదవుల్లో అందలం ఎక్కించారన్నారు. మహిళలకూ అన్ని పదవుల్లో 50 శాతం అవకాశం కల్పించారన్నారు. భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మరింత అభివృద్ధి చెందాలన్నా... పదవులు దక్కాలన్నా వైఎస్సార్‌సీపీని అధికారంలో కొనసాగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ తదితరులు ప్రసంగించారు. మేధావులు తమ ప్రసంగంలో పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో బెస్త, రజక కార్పొరేషన్ల డైరెక్టర్లు రమణ, మీసాల రంగయ్య, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, రాష్ట్ర వీరశైవ లింగాయత సంఘం అధ్యక్షుడు దండిన శివానంద, టీటీడీ పాలక మండలి సభ్యుడు అశ్వత్థనాయుడు, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెన్నోబులేసు, యువ నాయకుడు ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి, విడపనకల్లు, ఉరవకొండ, కూడేరు, బెళుగుప్ప, వజ్రకరూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన మేధావులు, ప్రముఖులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయిక పేరుతో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గుత్తి: స్థానిక శ్రీరంగా గురుకుల ఉన్నత పాఠశాలలో 1993–94లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం గుత్తిలోని వసుధ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ కలయిక పేరుతో సమావేశమయ్యారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులేకుండా పోయాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలో తాము చేసిన అల్లరిని గుర్తు చేసుకుని మురిసిపోయారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు ఎల్లావులు ఆంజనేయులు, రామకృష్ణ, మల్లి, రామ్మోహన్ తదితరులు నేతృత్వం వహించారు.

● అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెద్దవడుగూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96లో కలసి చదువుకున్న పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. పాఠశాల ఆవరణలోని సరస్వతీదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాడు తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులు రామకృష్ణ, బాబాఫకృద్దీన్, సంగమ్మ, నాగిరెడ్డి, రవికుమార్, నారాయణస్వామి తదితరులను ఘనంగా సన్మానించారు. అనంతరం అనారోగ్యాలతో బాధపడుతున్న మిత్రులను గుర్తించి వారికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌బీఎన్ అధ్యాపకులకు పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ నల్లా ఓబిరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్వాతంత్ర్య సమర యోధుడు, శతాధిక గ్రంథకర్త పడాల రామారావు శత జయంతి సందర్భంగా అందజేసే స్మారక పురస్కారాలకు అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ నల్లా ఓబిరెడ్డి, వాదులపల్లి ఫిరోజ ఎంపికయ్యారు. శనివారం రాజమండ్రి వేదికగా జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు పెనుకొండ లక్ష్మీనారాయణ, వల్లూరి శివప్రసాద్, పడాల వీరభద్రరావు, ప్రిన్స్‌పాల్ డాక్టర్ రమణమూర్తి, విశ్వేశ్వర రెడ్డి, పి.సంజీవ రావు, చైర్మన్ సూర్య నారాయణరాజు చేతుల మీదుగా వారు పురస్కారాలు అందుకున్నారు.

'సాక్షి' స్పెల్‌బీకి విశేష స్పందన



స్పెల్‌బీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

- సెమీఫైనల్ పోటీలకు హాజరైన కర్నూలు, అనంతపురం జిల్లాల విద్యార్థులు

కర్నూలు సిటీ: స్థానిక రవీంద్ర స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన రీజినల్ స్థాయి స్పెల్‌బీ సెమీ ఫైనల్ పోటీలకు విశేష స్పందన లభించింది. అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి నాలుగు కేటగిరీల్లో 58 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు తెలిపారు. కొత్త పదాలు పరిచయం కావడంతోపాటు, వాటి ఉచ్చారణ గురించి తెలుసుకున్నామని చెప్పారు. స్పెల్‌బీ ప్రోగ్రామ్ తమ పిల్లల ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంచడమే కాకుండా, మరింత అభివృద్ధి చేసుకునేందుకు దోహదపడుతోందని తల్లిదండ్రులు తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఆంగ్ల పరిజ్ఞానం తప్పనిసరి. మంచి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ప్రపంచ భాషగా గుర్తింపు పొందిన ఇంగ్లిష్‌లో నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకు స్పెల్‌బీ వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ తరహా పోటీలను గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న సాక్షి మీడియా గ్రూప్‌నకు ధన్యవాదాలు తెలిపారు.

పేద బ్రాహ్మణుడికి పెద్ద కష్టం

- కిడ్నీ వ్యాధితో బాల మురళీ సతమతం
- సాయం కోసం ఎదురు చూపులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పురోహితుడు బాలమురళీ

అనంతపురం కల్చరల్: చాలీ చాలని ఆదాయమే ఉన్నా పౌరోహిత్యంపై మమకారంతో ఆ వృత్తిపైనే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న ఓ పేద పురోహితుడికి పెద్ద కష్టం వచ్చి పడింది. రోజు రోజుకూ ఆరోగ్య పరిస్థితిని క్షీణిస్తోంది. వివరాలు.. నగరంలోని రెండో రోడ్డులో అక్షింతల బాలమురళీకృష్ణ నివసిస్తున్నారు. భార్య, ఇంజినీరింగు చదివే కుమారుడు ఉన్నారు. బాలమురళీకృష్ణ తండ్రి కూడా వీరి వద్దే ఉంటున్నారు. 4 దశాబ్దాలుగా బాలమురళీకృష్ణ పౌరోహిత్యం నిర్వహిస్తున్నారు.

కిడ్నీ వ్యాధితో సతమతం..

అంతా బాగా సాగిపోతున్న క్రమంలోనే బాలమురళీకృష్ణ కిడ్నీ వ్యాధి బారిన పడ్డాడు. ఓ వైపు కుటుంబ పోషణ, మరోవైపు వైద్యం కోసం ఇప్పటికే ఉన్నదంతా ఖర్చు చేసుకున్నాడు. ఖర్చులు పెరిగిపోతుండడంతో ఆందోళనకు గురై ఆస్పత్రిపాలయ్యాడు. నగరంలోని ఓ హాస్పిటల్‌లో వైద్యులు బెంగళూరు కానీ, హైదరాబాదు కానీ వెళ్లి త్వరగా కిడ్నీ మార్పిడి చేయించుకుంటే తప్ప కోలుకోలేని పరిస్థితి లేదని చెప్పడంతో హతాశుడయ్యాడు. ఆత్మాభిమానంతో చేయి చాచడం ఇష్టం లేని బాలమురళీకృష్ణను బ్రాహ్మణ సంఘం నాయకులు దేవరకొండ బాలాజీ శర్మ ఒప్పించి కొంత మొత్తం సేకరించారు. అయితే వైద్యం ఖర్చు కనీసం రూ.10 లక్షలు కావచ్చని తేలడంతో మానవతామూర్తులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

సాయమందించదలచిన వివరాలు..
అక్షింతల బాలమురళీకృష్ణ
బ్యాంకు అకౌంట్ నం. - 32561730463
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ - ఎస్‌బీఐఎన్0010659

మానవతామూర్తులు స్పందిస్తే బయటపడతా..

ఉన్న నాడు తిన్నాం, లేని నాడు పస్తులున్నాం. ఏనాడూ ఇతరుల సాయం కోరలేదు. అందుకే వ్యాధి ముదిరిపోతున్నా బాధ దిగమింగి ఓర్చుకున్నా. కానీ పరిస్థితి చేయిదాటి పోయింది. 9 నెలల నుంచి పురోహిత్యం చేయలేకపోతున్నా. కుటుంబ పరిస్థితి తలచుకుంటే భయమేస్తోంది. కొందరు పురోహితులు స్పందించి కొంత సాయమందించారు. మానవతామూర్తులు స్పందిస్తే బయట పడతాననే నమ్మకం ఉంది.

– అక్షింతల బాల మురళీకృష్ణ, పురోహితుడు

ఎలుగుబంట్ల సంచారంతో బెంబేలు



రాయదుర్గంలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం వద్ద సంచరిస్తున్న ఎలుగుబంటి

రాయదుర్గం టౌన్: జన నివాస ప్రాంతాల్లో ఎలుగుబంట్లు సంచరించడంతో రాయదుర్గం వాసులు బెంబేలెత్తిపోయారు. గ్యాస్ గోదాము కురాకుల గుట్ట సమీపంలో శనివారం రాత్రి 7.30 గంటలకు కొండ గుట్టపై నుంచి ఎలుగుబంట్లు దిగుతుండడం గమనించిన కొందరు వెంటనే స్థానికులను అప్రమత్తం చేశారు. అలాగే కోటలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం వద్ద ఆదివారం తెల్లవారుజామున ఓ ఎలుగుబంటి సంచారాన్ని స్థానికులు గమనించారు. వీటికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

వ్యక్తి దుర్మరణం



నాగముని (ఫైల్)

బుక్కరాయసముద్రం: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు...నార్పల మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన నాగముని (47), వెంకట్రాముడు ఆదివారం మధ్యాహ్నం ఒకే ద్విచక్ర వాహనంపై అనంతపురానికి బయలుదేరారు. మార్గ మధ్యంలో కొర్రపాడు వద్ద ఉన్న గురుకుల పాఠశాల వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో నాగముని అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. నాగమునితో పాటు ప్రయాణిస్తున్న వెంకట్రాముడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రుడిని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

లారీలు ఢీ - ఒకరి మృతి



ఢీకొన్న వాహనాలు

శింగనమల: మండలంలోని నడిమిదొడ్డి సమీపంలో ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి నుంచి బత్తలపల్లి వైపు వెళుతున్న లారీ నడిమిదొడ్డి సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న మరో లారీ పరస్పరం ఢీకొన్నాయి. ఘటనలో తాడిపత్రికి చెందిన లారీ డ్రైవర్ వెంకట్రాముడు, మరో లారీలో ఉన్న ఓడీసీ మండలానికి చెందిన అక్కులప్ప, రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకట్రాముడు (59) మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఫుట్‌బాల్ ఇన్‌స్పైర్ టోర్నీ విజేత 'అనంత'



ట్రోఫీతో సందడి చేస్తున్న అనంతపురం జట్టు

అనంతపురం: ఆర్డీటీ, ఫౌండేషన్ లాలీగా సహకారంతో అనంత క్రీడా గ్రామం వేదికగా సాగిన అండర్ 17 బాలికల ఫుట్‌బాల్ ఇన్‌స్పైర్ టోర్నీ విజేతగా అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్టు నిలిచింది. ఇన్‌స్పైర్ కప్ మూడో ఎడిషన్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ముగిసాయి. ఈ పోటీల్లో ఎఫ్‌సీ (గోవా), లిబర్టీ లేడీస్ (తమిళనాడు) లైఫ్ స్పోర్ట్స్(తమిళనాడు) నాంది (గుజరాత్) గుజరాత్ స్పోర్ట్స్ స్కూల్ (,గుజరాత్), అనంతపురం స్పోర్ట్స్ కళాశాల(అనంతపురం), మహిళా జన్ అధికార సమితి(రాజస్తాన్), అనంతపురం యునైటెడ్(ఆంధ్రప్రదేశ్) జట్లు ప్రాతినిధ్యం వహించాయి. మొత్తం 144 మంది యువ ఫుట్‌బాల్ క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో కంపాషన్ ఎఫ్‌సీ జట్టుతో తలపడిన అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్టు 3–0 గోల్స్ తేడాతో ఓడించి చాంపియన్‌గా నిలిచింది.

వ్యక్తిపై కేసు నమోదు

విడపనకల్లు: రాయి విసిరి కానిస్టేబుల్‌ను గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోద చేసినట్లు గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. ఆదివారం ఉరవకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విడపనకల్లు మండలంలోని చీకలగురికి గ్రామానికి చెందిన కొత్తపల్లి చంద్రమోహన్... ఈ నెల 1న రాత్రి చీకలగురికి పంచాయ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండా పీకేసి నానా దుర్భాషలాడుతూ కాల్చివేశాడు. ఘటనపై అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి మహేష్ ఫిర్యాదు చేయడంతో చంద్రమోహన్‌ను విచారణ నిమిత్తం 2వ తేదీన పాల్తూరు పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ఆ సమయంలో స్టేషన్ సెంట్రీగా ఉన్న కానిస్టేబుల్ రాజన్న ఎదుట పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే చిందులు తొక్కుతూ పోలీస్ వ్యవస్థను దుర్భాషలాడాడు. ఆ సమయంలో సెంట్రీ కానిస్టేబుల్ సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తే ఇటుక విసిరి గాయపరిచాడు. దీంతో కానిస్టేబుల్ రాజన్నను గాయపరిచినందుకు చంద్రమోహన్‌పై మరో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వివరించారు.

క్లుప్తంగా

కార్తికేయుడికి పంచామృతాభిషేకాలు



స్వామి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలతో పాటు విశేష పూజలు నిర్వహించారు. స్వామికి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామి బంగారు కవచాన్ని మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాల సర్పదోష నివారణ హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సంతల ఆదాయం రూ.4.26 లక్షలు



మార్కెట్‌యార్డులో పశువుల సంతలో అమ్మకానికి వచ్చిన ఎద్దులు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రికార్డు స్థాయిలో 4.26 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఏ.ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,41,720 వసూలయ్యింది. ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,84,700 మేర మార్కెటింగ్ ఫీజు వసూలైందని వారు తెలిపారు.

28న జిల్లా రజక మహాసభ

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక లలితకళా పరిషత్‌లో ఈనెల 28న ఉదయం 11 గంటలకు జిల్లా రజక మహాసభ నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమ్మన్న ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా రజక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సభకు రజకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్యశిబిరంలో పాల్గొన్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు

అనంతపురం కల్చరల్: నగరంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, అసీఫుద్దీన్, నబీరసూల్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా కంటి పరీక్షల అనంతరం శస్త్రచికిత్సలు చేయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదానం, దుప్పట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, గోవిందరెడ్డి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ చేస్తున్న సేవలు నిరుపమానమన్నారు.

సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



పెన్షనర్స్ భవన్‌లో సమావేశమైన సచివాలయ ఉద్యోగులు

అనంతపురం కార్పొరేషన్: గ్రామ సచివాలయం సంక్షేమ, విద్యా సహాయకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఆదివారం పెన్షనర్స్ భవన్‌లో ఉమ్మడి జిల్లా సంక్షేమ, విద్యా సహాయకుల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘం గౌరవాధ్యక్షులు నల్లపరెడ్డి సాయినాథరెడ్డి, మాసినేని శ్రీపతి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆర్థిక, సర్వీస్ ప్రయోజనాలను తమకు కల్పించేలా చూడాలన్నారు. ప్రొబేషన్ పీరియడ్‌లో రెండేళ్ల నోషనల్ ఇంక్రిమెంట్లు, అరియర్స్, పదోన్నతులు, పేస్కేల్ తదితరాలు అమలు చేయాలన్నారు. సంఘం రాష్ట్ర నాయకులు ఆకులేటి లక్ష్మీనారాయణ, షణ్ముకానంద రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి, ముక్తాపురం చంద్రమోహన్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు కురుబ అనిల్, కోశాధికారి ఎరుకుల రవి కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే మా లక్ష్యం

- అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న రెడ్డి సంఘం నాయకులు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రజా సంక్షేమం, అభివృద్ధే మా లక్ష్యమని, గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదటగా వేమన రెడ్డి సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఎమ్మెల్యేను సన్మానించారు. రెడ్డి సంఘం కోసం స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యేకి రెడ్డి సంఘం వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆత్మకూరులో నూతనంగా ఏర్పాటు చేసిన శుద్ధజల నీరు (ఫిల్టర్ వాటర్) మిషన్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మకూరు ప్రజలకు రూ.5 లకే క్యాన్ నీరు అందించే ఏర్పాటు చేశామని తెలిపారు. రూ.5 కాయిన్ వేస్తే మిషన్‌లో నీరు వస్తాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అభివృద్ధి పనులు ఎన్నో జరిగాయన్నారు. నెలాఖరులో తుంగభద్ర, కృష్ణా జలాలు అందించి, ఇంటింటికీ కొళాయి ద్వారా నీరందించి, శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. దశాబ్దాలుగా ఉన్న నీటి సమస్య తమ హయాంలో తీరుతున్నందున సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి , మాజీ జెడ్పీటీసీ మధు, వైస్ ఎంపీపీ నీలిమ, విజయ్, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ధనుంజయ రెడ్డి, వాసుదేవరెడ్డి, ఫణిరెడ్డి, అతిక్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కులశేఖర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ఈశ్వరరెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, నాగభూషణంరెడ్డి, ఓబుళరెడ్డి, పెద్ద కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి జగనన్నకు అండగా నిలుద్దాం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: పేదల పెన్నిధి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ అండగా నిలవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని మేడాపురం, ఓబుళంపల్లి, చెన్నేకొత్తపల్లి, న్యామద్దల గ్రామాల్లో నిర్వహించిన వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ.3 వేలకు పింఛన్ మొత్తాన్ని పెంచి, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెద్ద కొడుకులా ఆదుకున్నారన్నారు. మండలంలో 7,117 మందికి రూ.2 కోట్ల16 లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు. గతంలో రాప్తాడు నియోజకవర్గానికి ఎమ్మెల్యే మంత్రులుగా పనిచేసిన పరిటాల కుటుంబం రక్తం పారిస్తే.. తాను ఎమ్మెల్యే గా గెలిచిన తరువాత నీళ్ల పారించి, రైతాంగానికి అండగా నిలిచానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి, నాయ కులు ఎస్‌టీడీ శ్రీనివాస రెడ్డి, ప్యాదింటి నరసింహా రెడ్డి, మేడాపురం సూరి, హనుమంత రెడ్డి, మనేరు నరసింహులు, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఓబుళంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి, సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నారెడ్డి, ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, ఎంపీటీసీ వెంకట రెడ్డి పాల్గొన్నారు.

అకడమిక్ కన్సల్టెంట్ల జీతాలు పెంచాలని వినతి



ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లు

అనంతపురం: జీతాలు పెంచాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లు కోరారు. ఈ మేరకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామి రెడ్డికి ఆదివారం వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. వర్సిటీలో 80 మందికి పైగా అకడమిక్ కన్సల్టెంట్లకు 110 జీఓ ప్రకారం గంటల తరబడి కాకుండా నెలవారీ వేతన విధానం అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ సయ్యద్ హుస్సేన్, జయచంద్రా రెడ్డి, వీర్రాజు, శివారెడ్డి, ఆదిశేఖర్ రెడ్డి, సురేష్ రెడ్డి, ముత్యాలు, సాకే రాజు, నాగేంద్ర, గురుమూర్తి, రాంప్రసాద్ రెడ్డి, గోపాల్, వెంకట్రామిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె: ఎగువపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాలు..కనంపల్లికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా అదే సమయంలో ఎగువపల్లికి చెందిన నిరంజన్ రెడ్డి గ్రామంలోకి వెళ్లడానికి ఎగువపల్లి సమీపంలో రోడ్డుదాటుతుండగా రెండు బైక్‌లు ఎదురుగా ఢీకొన్నాయి. ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు దాటుతుండగా..

గార్లదిన్నెలోని శింగనమల క్రాస్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. శింగనమల 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. సాలమ్మ అనే మహిళ శింగనమల క్రాస్ సమీపం లో రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొంది. ఘటనలో ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను 108లో అనంతపురము ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా సఫల ఏకాదశి పూజలు

పామిడి: పట్టణంలోని అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం సఫల ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి విగ్రహాలకు తెల్లవారుజామునా నుంచే అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

- విద్యుత్ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంజీవరెడ్డి, ఉద్యోగులు

అనంతపురం టౌన్: విద్యుత్ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకెళ్లాలని, అప్పుడే విజయం సాధిస్తారని విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం – 327 జాతీయ అధ్యక్షుడు జీ.సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం గుత్తిరోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో 2024 సంఘం డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో వివిధ రకాల విద్యుత్ ఉద్యోగ సంఘాలు ఉన్నాయన్నారు. అందులో తమ 327 సంఘానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రతి విద్యుత్ ఉద్యోగి సంఘం అభివృద్ధి కోసం ఐక్యంగా ముందుకు రావడమే కారణమన్నారు. విద్యుత్ సంస్థల్లో తమ హక్కులను సాధించుకోవడానికి ఉద్యోగులు తలపెట్టే ప్రతి ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం సంక్షేమ సంఘం డైరీతోపాటు 2024 క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌బాబు, కార్యదర్శి డీఆర్ హర్ష, ప్రచార కార్యదర్శి దాదాపీర్, కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగార్జున, అల్లాబకాష్, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష ఏపీసీ



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాదరావు

అనంతపురం ఎడ్యుకేషన్: కేజీబీవీల్లోని పదోతరగతి విద్యార్థినులందరూ పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ వి.నాగరాజు, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు సూచించారు. జిల్లాలోని కేజీబీవీ పదోతరగతి విద్యార్థినులందరికీ ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టు టీచర్లకు 'సీఎస్ఆర్ అకాడమి' ఆధ్వర్యంలో ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం బుక్కరాయసముద్రం కేజీబీవీలో జరిగిన ఈ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని డీఈఓ, సమగ్రశిక్ష ఏపీసీ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్టేట్ రీసోర్స్ పర్సన్లు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించి 10వ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. జీసీడీఓ మహేశ్వరి మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థుల కోసం పంచతంత్ర ప్లాన్ అమలు చేయాలని కోరారు. సీఎస్ఆర్ అకాడమీ కన్వీనర్ ప్రణయ్ సిద్ధార్థ మాట్లాడుతూ చదువుతోనే అన్ని రంగాలూ అభివృద్ధి చెందుతాయన్నారు. పేద పిల్లల చదువు కోసం ఆర్టీటీ స్ఫూర్తితో సాధ్యమైనంత మేరకు విద్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, సీఎంఓ గోపాల్, ఏపీఓ నారాయణస్వామి పాల్గొన్నారు.

కాలేయ బాధితుడిపై 'అమ్మ' కరుణ



తిప్పేస్వామి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న అమ్మ సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలోనే కాదు..చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడ ఎవరు ఆపన్నహస్తం కోసం ఎదురుచూసినా..వెంటనే దయార్ధ్ర హృదయంతో స్పందించే 'అమ్మ' సంస్థ నగరంలోని కాలేయ బాధితుడిపై కరుణ చూపింది. శస్త్రచికిత్స కోసం రూ.4 లక్షలు అందించి, మానవతాదృక్పథాన్ని చాటుకుంది. నగరంలోని సాయినగర్‌కు చెందిన తిప్పేస్వామి ఆటో నడుపుతూ భార్య ఝాన్సీ లక్ష్మీ, ఇద్దరు కొడుకులను పోషించేవాడు. కుటుంబం సాఫీగా గడిచిపోతుండేది. ఉన్నపళంగా తిప్పేస్వామికి జబ్బు చేయగా, నగరంలోని పలు ఆస్పత్రుల్లో చూపించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించగా, లివర్ పాడైపోయిందని వైద్యులు నిర్ధారించారు. కాలేయ మార్పిడి చేయాలని, శస్త్ర చికిత్స కోసం మొత్తం రూ.14 లక్షలు ఖర్చవుతుందని సూచించారు. ఖరీదైన శస్త్రచికిత్స చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేదు. ఉన్న ఇల్లు అమ్మినా రూ.5లక్షలు మాత్రమే వచ్చింది. మిగిలిన డబ్బు సమకూర్చుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు. దీంతో అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డిని కలిసి తన దీన స్థితిని చెప్పుకున్నారు. ఆయన మానవతాదృక్పథంతో స్పందించి, వెంటనే రూ.4 లక్షలు సాయం అందించమేకాకుండా, సీఎం రిలీఫ్ ఫండ్ కోసం స్వయంగా దరఖాస్తు చేశాడు. ప్రభుత్వం కూడా మరో రూ.5లక్షలు మంజూరు చేసింది. ఆ మొత్తం డబ్బును తరిమెల రమణారెడ్డి ఆదివారం బాధిత కుటుంబానికి అందించారు. భవిష్యత్తులోనూ ఇంకా ఏమైనా అవసరం ఉంటే సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు.

హక్కులను కాలరాస్తున్న కంపెనీలు

- మెడికల్ రెప్స్ సంఘం రాష్ట్ర కోశాధికారి ప్రసాద్



మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ సంఘం నూతన కార్యవర్గం

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అండతో ఫార్మా కంపెనీలు మెడికల్ రెప్స్ హక్కులను కాలరాస్తున్నాని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ సంఘం (ఏపీఎంఎస్ఆర్‌యూ) రాష్ట్ర కోశాధికారి దుంపలు ప్రసాద్ విమర్శించారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ వార్షిక సమావేశానికి సంఘం రాష్ట్ర కోశాధికారి దుంపలు ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎస్‌పీఈ యాక్ట్ 1976 రద్దు చేయడంతో కార్మికులు ఏ విధంగా నష్టపోతున్నారనేది వివరించారు. సమావేశంలో సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి రాజమోహన్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం..

ఏపీఎంఎస్ఆర్‌యూ జిల్లా అధ్యక్షుడిగా అమర్‌నాథ్, కార్యదర్శిగా మంజూనాథ్, కోశాధికారిగా విజయ్‌నాయుడు, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, నరేంద్ర, సహాయ కార్యదర్శులుగా ఆంజనేయలు, నాగరంగయ్య ఎన్నికయ్యారు.

సీమ హక్కుల సాధనకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారాయణస్వామి

అనంతపురం కల్చరల్: రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రాయలసీమకు అన్యాయం జరుగుతూనే ఉందని, సీమ హక్కుల సాధనే లక్ష్యంగా అందరూ ఉద్యమించాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం సీమ ఉద్యమకారుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో 'రాయలసీమ సమాలోచన– ఆచరణ' అనే అంశంపై మేధావులతో సమావేశం జరిగింది. స్థానిక సెంట్రల్ లైబ్రరీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో బండి నారాయణస్వామి మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం, విశాలాంధ్ర ఏర్పడిన నాటి నుంచే సీమకు అన్యాయం జరిగిందన్నారు. రాజకీయ లాబీయింగ్ ద్వారా మాత్రమే న్యాయం జరుగుతుందని, సీమ హక్కులను కాపాడే విధంగా అన్ని పార్టీలు కలిసి రావాలని కోరారు. ఆచార్య సదాశివరెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్, మేధావులు ఎస్ఎం బాషా, సుబ్రమణ్యం, సీనియర్ రచయిత డాక్టర్ శాంతినారాయణ, న్యాయవాది రాంకుమార్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, నారాయస్వామి తదితరులు మాట్లాడారు.

చెత్త తరలింపునకు ప్రత్యామ్నాయ చర్యలు



చెత్తను తరలించకుండా అడ్డుపడుతున్న కార్మిక సంఘాల నాయకులు



నగరంలో చెత్త సేకరణకు చర్యలు తీసుకుంటున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో కార్మికుల సమ్మె కొనసాగుతుండడంతో నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ఆదివారం కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశాలతో కార్యదర్శి సంగం శ్రీనివాసులు పర్యవేక్షణలో చెత్త తరలింపునకు చర్యలు చేపట్టారు. నగరంలోని 38, 39 డివిజన్లతో పాటు పాతూరు, రెవెన్యూ కాలనీ, తదితర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను కంపోస్టు యార్డుకు తరలించారు. వివిధ ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లను శుభ్రం చేయించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

చెత్త తరలింపును అడ్డుకున్న కార్మికులు..

నగర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు నగరపాలక సంస్థ అధికారులు చేపడుతున్న చర్యలను కార్మిక సంఘాల నాయకులు దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారు. ఆదివారం 3, 6వ రోడ్డులో పోలీసు ప్రొటెక్షన్ సహాయంతో చెత్త తరలించేలా చర్యలు తీసుకున్నారు. కార్మిక సంఘాల నాయకులు చెత్తను తరలించకూడదని వాహనాలకు అడ్డంగా నిలిచారు. సమ్మెకు ఎవరూ అడ్డురావడం లేదని, కనీసం చెత్త తరలించకపోతే నగర ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, మానవతా దృక్పథంతో సహకరించాలని అధికారులు కార్మిక సంఘాల నాయకులు సూచించారు. కానీ వారు చెత్తను తరలించకుండా అడ్డుకున్నారు. రెగ్యులర్ ఉద్యోగుల నుంచి పరకలు లాక్కొని వెళ్లారు.

'కోవిడ్' కార్మికులు సమ్మెలోకి..

వాస్తవంగా కోవిడ్ సమయంలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు పాలకవర్గం 70 మంది కోవిడ్ వర్కర్లను విధుల్లోకి తీసుకుంది. వీరికి ప్రతి నెలా వేతనాలు చెల్లిస్తోంది. కానీ ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో వీరు సమ్మె బాట పట్టారు. కోవిడ్ సమయంలో తీసుకున్న కార్మికులు..కోవిడ్ కేసులు ప్రబలే సమయంలో పత్తా లేకుండా పోవడం విమర్శలకు తావిస్తోంది.

నీటి సరఫరాను అడ్డుకుంటాం..

నగరంలో చెత్త తరలించేందుకు చర్యలు తీసుకుంటున్న అదనపు కమిషనర్ రమణారెడ్డితో కార్మిక సంఘాల నాయకులు వాగ్వాదానికి దిగారు. ఆదివారం నగరంలోని గుల్జార్‌పేట, ఆదిమూర్తినగర్, తదితర ప్రాంతాల్లో చెత్త తరలింపుకు అదనపు కమిషనర్ చర్యలు తీసుకున్నారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన కార్మిక సంఘాల నాయకులు చెత్త తరలిస్తే నీటి సరఫరాను అడ్డుకుంటామని, నగరాన్ని అంధకారం చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు.

చెత్త సేకరణకు చర్యలు

- నగరంలో అర్ధరాత్రి పర్యటించిన మేయర్ వసీం
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కార్మికులకు సర్దిచెప్పిన మేయర్

అనంతపురం కార్పొరేషన్: నగరంలో చెత్త సేకరణకు మేయర్ వసీం చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం వివిధ ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులను కార్మిక సంఘాల నాయకులు అడ్డుకున్న విషయం విదితమే. నగరంలో సమస్యాత్మకంగా ఉన్న 37, 38, 39,42 డివిజన్లలో మేయర్ అర్ధరాత్రి పర్యటించారు. నగరపాలక సంస్థ అధికారులను అప్రమత్తంగా చేశారు. రాత్రికి రాత్రే చెత్తను కంపోస్టు యార్డుకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రాంనగర్‌లో మేయర్ సమక్షంలో చెత్తను జేసీబీల ద్వారా తరలిస్తుండగా కార్మిక సంఘాల నాయకులు అడ్డుకున్నారు. కార్మికుల సమస్యలు తీర్చడానికి తాము ముందుంటామని, ఇప్పటికే తమ పరిధిలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతామని చెప్పినట్లు మేయర్ తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చెత్త తరలింపునకు సహకరించాలన్నారు. కార్మికులను అడ్డుకోవడం సరికాదన్నారు. నిరసనల పేరుతో చెత్తను తరలించకపోతే ప్రజలు ఇబ్బందుల పడాల్సి వస్తుందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దీంతో కార్మిక సంఘాల నాయకుల అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 1993–94 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. అప్పటి విద్యార్థులు చదువులు పూర్తయ్యి, ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. మరికొందరు వ్యవసాయంపై ఆధారపడ్డారు. దశాబ్దాల తర్వాత అందరూ పాఠశాలలో కలిసి, సంబరంగా గడిపారు. అనంతరం నాటి గురువులు అంకిరెడ్డి, వెంకట్రాముడు, సాయినాథ్, వెంకటేశ్వర్లు, సావిత్రమ్మ, తిక్కస్వామి, వెంకటేశులు, రామాంజినేయులును సన్మానించారు.